

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### రాగాలా... సరాగాలా....

**తలుపు తీసుకుని లోపలికి వచ్చిన** భర్తని చూడగానే చరిత ఆనందంగా చెప్పింది.

"వచ్చేసావా? అబ్బ నీ కోసం ఎంతసేపటి నుంచి చూస్తున్నానో తెలుసా?"

"ఏం? సినిమా ప్రోగ్రాం వేసావా?" అమిత్ అడిగాడు

"ఛ! అంత చిన్న విషయంకాదు"

"మరి?"

"నేనో అద్భుతమైన కథరాసా తెలుసా? స్వాతి కథల పోటీకి పంపుతున్నా బహుమతి లక్షరూపాయలట. దాంతో ఏం చేద్దాం?" కళ్ళు పెద్దవి చేసి చెప్తున్న భార్యని చూసి ఫక్కున నవ్వాడు అమిత్.

"ఎందుకానవ్వు?" ఉక్రోషంగా అడిగింది.

"అద్భుతమైన కథ అని నువ్వు చెప్పకూడదు. చదివిన వాళ్ళు చెప్పాలి. ఇంతకీ ఏం రాసావు?"

"చెప్పనా? మరికొంచెం పెద్ద కథ పర్లేదా?" ఆశగా అడిగింది.

"పర్లేదు - చెప్పు వింటా,"

"ఓకే. సావధానంగా విను. ప్రింట్ కాకుండానే వినడం నీ అదృష్టం." చరిత గొంతు సవరించుకుంది.

"మారుతీ ఆల్టో కారు పార్క్ హయత్ హోటల్ ముందు ఆగింది. డ్రైవింగ్ సీట్‌లోని విజయ్ తల తిప్పి భార్యవైపు చూసాడు. వీధి దీపాల కాంతిలో ఆమె మెళ్ళోని డైమండ్ నెక్లెస్ తళుక్కున మెరిసింది.

"వచ్చేసామా నాన్నా?" వెనక నుంచి అడిగారు పిల్లలు.

"వచ్చేసాం. జాగ్రత్తగా చూసుకుని దిగండి" అని చెప్పి కారు దిగాడు. అతని భార్య కూడా దిగి మెడలోని డైమండ్ నెక్లెస్‌ని ఓసారి సర్దుకుని భర్త వెంట లోపలికి దారి తీసింది.."

"ఆగాగు. ఇంతకీ ఈ విజయ్ ఎవరు?" అమిత్ ఆసక్తిగా అడిగాడు.

"ఓ బిజినెస్ మేన్" గర్వంగా చెప్పింది.

"పార్క్‌హయత్ హోటల్‌కి ఎందుకు వెళ్తున్నారు?"

"వీకెండ్ కదా, ఫేమలీతో డిన్నర్"

నవ్వలేక పొట్ట పట్టుకున్నాడు అమిత్.

"హు"

"కోపంతో హుంకరించింది చరిత.

"ఎందుకా నవ్వు?"

"సరే. నేను వివరంగా చెప్తా. నువ్వు హర్ట్ కాకూడదు. ఒకేనా?"

"సరే చెప్పండి. అప్పట్లో చలంగారివి కూడా పిచ్చిరాతలన్నారట మీలాంటి వాళ్ళు" నిష్టూరంగా చెప్పింది.

"బాబోయ్! చలంతో పోల్చుకుంటున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ఏం? ఆయనా రచయితే, నేనూ అంతే."

"నీ ఆత్మవిశ్వాసానికి జోహార్లు. సరే విను. మీ విజయ్ ధనవంతుడా?"

"విపరీతమైన రిచ్."

"విపరీతమైన రిచ్ వాడు ఏ బెంట్లీ కారులోనో వెళ్తాడు కానీ మరీ చీప్‌గా మారుతీ కారులో వెళ్తాడా?"

"ఓ! అవునుకదా? నాకా కార్లు, రేట్లు తెలీవు అమ్మూ" ఒప్పుకుంది.

"మరి అంత రిచ్‌వాడు సొంతంగా డ్రైవ్ చేసుకుంటూ ఎందుకు వెళ్తాడు? డ్రైవర్ని పెట్టుకోవాలికదా?"

"ఫేమిలీతో వెళ్తున్నాడు కదా ప్రైవసీ కావాలని" తన సమర్ధనకి సంతోషపడింది చరిత.

"కానీ విపరీతమైన రిచ్‌వాళ్ళు పబ్లిక్ ప్లేసెస్‌కి డ్రైవర్‌తోనే వస్తారు చెర్రీ. ఎందుకంటే పార్కింగ్ ప్రాబ్లమ్స్ ఉంటాయి కదా?" వివరించాడు అమిత్.

"ఓ! కాబోలు మనం మాములు రిచ్‌కూడా కాదు కదా. నాకు తెలీదు"

"మనం ఎప్పుడైనా తినడానికి బయటకి వెళ్దాం అనుకుంటే ఎక్కడికి వెళ్తాం?"

"చట్నీస్‌కీ, మినర్వాకీ వెళ్తాం."

"ద్వారకాకి, అశోకాకీ ఎందుకు వెళ్ళము?"

"అవి హోటల్స్ కదా?"

"పార్క్ హయత్ కూడా హోటలే. వాళ్ళు ఎంచక్కా ఇటాలియన్ ఫుడ్డో లేదా మెక్సికన్, స్పానిష్ ఇంకా వెరైటీ పదార్ధాలు దొరికే రెస్టారెంట్స్‌కో వెళ్ళాలి తప్ప ఫైవ్‌స్టార్ హోటల్‌క్ ఎందుకు వెళ్తారు?"

"ఏమో! ఫైవ్ స్టార్ హోటల్ అంటే గొప్పగా ఉంటుందని." గొణిగింది.

"మనం చట్నీస్‌కో, మినర్వాకో వెళ్ళినప్పుడు నువ్వు ఏ నగలు వేసుకుంటావు?"

"అదేమన్నా పెళ్ళా, పేరంటమా? నల్లపూసల గొలుసు ఒకటే వేసుకుంటాను."

"మరి మిసెస్ విజయ్ డైమండ్ నెక్లెస్ ఎందుకు వేసుకుంది?"

"అంటే వాళ్ళు రిచ్ వాళ్ళు కదా?"

"పెళ్ళి పేరంటం కాదుగా? ఐనా రిచ్ వాళ్ళు వేసుకోవాలని ఏం లేదే? మన చంద్రబాబుగారబ్బాయి పెళ్ళి టీ.వీలో చూసి నువ్వేమన్నావు?"

"అయ్యో! పెళ్ళికొడుకు వాళ్ళమ్మ నగలేం వేసుకోలేదు. ఎన్టీఆర్ ఎన్ని కొనిచ్చి ఉంటారు. లాకర్‌లో పెట్టుకోపోతే కొడుకు పెళ్ళికి వేసుకోవచ్చుగా అన్నాను."

"గుడ్ నీ జ్ఞాపకశక్తి మెచ్చదగ్గది. ఆవిడ వేసుకోపోయినా చాలా నగలు ఉండి ఉంటాయని తెలుసుకదా నీకు?"

"అవును"

"కాబట్టి చాలావరకు రిచ్ పీపుల్ సింపుల్‌గానే ఉంటారు. అలా హోటల్స్‌కి డైమండ్ నెక్లెస్‌లు వేసుకురారు. అసలు మీ విజయ్ పుట్టు ధనవంతుడా? పెట్టు ధనవంతుడా?"

అప్పటికే చరిత కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

"ఏమో నేనంత ఆలోచించలేదు. నేను రాసేది కథ తప్ప పరిశోధనా వ్యాసంకాదు. కథ అంటేనే కల్పితం. అసలు రిచ్‌వాళ్ళ గురించి నాకేం తెలుసు?" ముక్కు ఎగపీల్చింది.

"క్రైం కథలు రాసేవాళ్ళకి హత్యలు చేయడం తెలుస్తుందా? ఎంత కథయినా కొంత లాజిక్ ఉండాలిగా? నాకు ఆకలేస్తోంది. ఏమైనా పెడ్తావా?"

"అయ్యో! కథ రాసే హడావిడిలో వంట చేయలేదు. పోనీ బయటకి వెళ్దామా?" ఆశగా అడిగింది.

"ఓకే. త్వరగా తయారవు. నీ కెంపుల నెక్లెస్ కూడా పెట్టుకో" నవ్వాడు.

ఉక్రోషంగా అతని నెత్తిమీద ఓ మొట్టికాయవేసింది చరిత.

"హలో అమ్మూ. త్వరగా ఇంటికి వచ్చేయ్ ఇంటికి" ఫోన్‌లో చెప్పింది చరిత.

"ఏం ఏమైంది? అంతా క్షేమమేగా?" కంగారుగా అడిగాడు అమిత్.

"అయ్యో సారి. కంగారు పడక ఇంకో అద్భుత.... కథ రాసాను. నువ్వు బావుందంటే ఫెయిర్ చేసి కొరియర్ చేస్తాను"

"సరే ఆరుకల్లా ఇంట్లో ఉంటా. బై" ఫోన్ పెట్టేసాడు అమిత్.

"ఇవేళ నేను ఒక బాధాసర్పదష్టురాలి గురించి రాసాను." చరిత విచారంగా చెప్పింది.

"సరే చెప్పు" సర్దుకుని కూర్చున్నాడు అమిత్.

"మల్లమ్మ వేగంగా నడుస్తోంది. తూలుతూ నడుస్తోంది."

"ఏం మందుకొట్టిందా?"

"మధ్యలో అడ్డుపడితే చంపుతా" అరిచింది చరిత.

"సరే. సరే. చెప్పు"

"వారం నుంచి జ్వరం ఒళ్ళునొప్పులు అన్నా కనికరం లేని ఇంటామె అన్ని పనులూ చేయించుకుంది. పని మానేస్తే వాళ్ళకి ఎక్కడ కోపం వస్తుందో అని వారం నుంచి పళ్ళబిగువున పని చేసీ చేసీ ఆమె శుష్క శరీరం ఇంకా శుష్కించి పోయింది. సాయంత్రం త్వరగా పనిముగించుకుని వద్దామంటే, ఇంటావిడ బూజులు దులపమంది. ఇంట్లో చంటాడికి జ్వరం. భర్త ఎక్కడికి పోయాడో అయిపులేదు.

పక్కింటి ఎల్లమ్మని చూస్తూండమని బతిమాలి పనిలోకి వచ్చింది. ఇప్పుడు ఈ బూజుల పని అయ్యేసరికి ఏడైంది. చీకటి. చిన్నపిల్ల చిట్టికి ఆకలేస్తోందో ఏమో! ఆలోచిస్తూ చేతిలోని సంచిని తడిమింది. బూజులు దులిపాక అమ్మగారు దయతో ఇచ్చిన పొట్లాన్ని ఆ సంచిలో పెట్టింది.

"జ్వరం వంక పెట్టుకుని రేపు రావేమో! అయ్యగారి చుట్టాలు వస్తున్నారు. మానకుండా రా" వస్తూంటే అమ్మగారు కఠినంగా చెప్పింది. 'హుం' జాలిలేని మనుషులు అనుకుంది.

తల్లిని దూరం నుంచే చూసి మట్టిలో ఆడుకుంటున్న చిట్టి పరిగెత్తుకు వచ్చి చెప్పింది.

"అమ్మా! ఆకలే."

దుఃఖంతో మల్లమ్మ కళ్ళు వర్షించాయి.

"పాపిష్టిదాన్ని. పిల్లలకి కడుపు నిండా తిండిపెట్టలేకపోతున్నాను" అనుకుంది.

"అన్నెట్లా ఉన్నాడే?" అడిగింది.

"వాడు పిలిచినా పలకట్లేదు" నాలుగేళ్ళ చిట్టి అమాయకంగా చెప్పింది.

"అమ్మో నా బిడ్డో" అని ఏడుస్తూ మల్లమ్మ తన గుడిసెలోకి పరిగెత్తింది. లోపల కుక్కి మంచం మీద చంటాడు ప్రశాంతంగా నిద్రపోయాడు. ఒంటిని తాకి చూసింది చల్లగా ఉంది. జ్వరం తగ్గింది అనుకుంది ఆనందంగా. ఆమె స్పర్శకి కళ్ళు తెరిచిన చంటాడు నీరసంగా అడిగాడు.

"అమ్మా ఆకలే."

అమ్మగారిచ్చిన పొట్లం గుర్తొచ్చి సంచిలోంచి దాన్ని తీసి విప్పదీసింది. గుప్పున పాచివాసన కొట్టింది పాడైపోయిన అన్నం, చపాతీ! దూరం నుంచి లౌడ్‌స్పీకర్‌లో 'ఇంతేలే నిరుపేదల బతుకులూ' అనే పాట హృద్యంగా వినిపిస్తోంది."

పొట్టపట్టుకున్న అమిత్‌ని చూసి ఉక్రోషంగా అడిగింది చరిత.

"ఈ పేద కథలో కూడా నీకు లోపాలు కనిపించాయా?"

"ఈ కథా కాలం ఎప్పుడు? ఏ ప్రదేశం? బీహారా? యుపినా?" అడిగాడు.

"కథాకాలం వర్తమానం, బీహార్, అస్సాం, గుజరాత్ వీటిగురించి నాకేం తెలుసు? మన హైదరాబాద్‌లోనే జరిగింది" ఉక్రోషంగా చెప్పింది.

"వారం రోజుల తూలిపోయే జ్వరం పక్కన పెట్టు. ఒక్కరోజు జ్వరానికైనా మన పనిమనిషి పనికి వస్తుందా?"

"రాదు"

"ఎవరైనా వస్తున్నారని నువ్వు చిన్న చిన్న ఎక్స్‌ట్రా పనులు చెపితే చేస్తుందా?"

"వచ్చినా చెయ్యదు నేనది ఒప్పుకోలేదు అంటుంది."

"అంత పాడైన పదార్థాలు ఇస్తే ఊరుకుంటుందా?"

"అసలు ఎందుకు పాడవుతాయి? ఫ్రిజ్‌లో ఉంటాయిగా?"

తన తప్పు అర్థమై నాలిక్కరుచుకుంది.

"ఇప్పుడు మన రాష్ట్రం చాలా వరకు అభివృద్ధి చెందింది చెర్రీ. అంత దరిద్రంగా బతికే వాళ్ళు తక్కువ. ముఖ్యంగా పని చేసేవాళ్ళు. వాళ్ళు రెండు మూడిళ్ళల్లో పని చేస్తూ నెలకి ఐదారువేలకి తక్కువ కాకుండా సంపాదిస్తున్నారు. వాళ్ళకీ టీ.వీలు, సెల్‌ఫోన్స్‌లాంటివి ఉంటున్నాయి. ఏ పని చెపితే ఆ పని చేయరు. ఒంట్లో బావుండకపోతే అసలు పనికేరారు. మనకి వాళ్ళెంత

అవసరమో తెలుసుకాబట్టి కొంత వరకు మనమీద జులుం చేస్తారుకూడా. నీ కథలో మల్లమ్మలా పూరిగుడిసెలో, కుక్కిమంచాల్లో ఉండటం లేదు. పిల్లలకి బావుండకపోతే చక్కగా డాక్టర్ల దగ్గరకి తీసుకెళ్ళి శ్రద్ధగా మందులు వేస్తారు. కొన్ని వెనకబడిన రాష్ట్రాల్లో నువ్వు చెప్పే దరిద్రం ఉండేదేమో కానీ, ఒళ్ళు వంచి పని చేసేవాళ్ళకి మన రాష్ట్రంలో జీవన ప్రమాణం పెరిగింది" వివరించాడు.

"హూం! నాకు రిచ్ వాళ్ళ గురించి తెలీదు. పూర్ వాళ్ళ గురించీ తెలీదు." చిన్నగా నిట్టూర్చింది చరిత.

ఆ శనివారం మధ్యాహ్నం అమిత్ అమితంగా భుజించి, రమణీప్రియ దూతిక తెచ్చి ఇచ్చిన కర్పూర విడియం నములుతూ ఆనందంగా శయనించిన వేళ కెవ్వున ఓ కేక వినిపించింది.

"ఏమైంది?" కంగారుగా లేచి అడిగాడు.

"నాకు ఎస్ఎంఎస్ వచ్చింది" చరిత ఉద్వేగంగా చెప్పింది.

"ఏమని? లాటరీలో నీ నెంబర్ నెగ్గి లక్షయూరోలు వచ్చాయనా?"

"ఛీ కాదు. స్వాతినుంచి. నా కథ సాధారణ ప్రచురణకి ఎన్నికైందిట"

"ఓ! కంగ్రాట్స్"

"కానీ నేనసలు కథ పంపలేదుగా? రాంగ్ నంబర్‌కి పంపారు మెసేజ్" నిరాశగా చెప్పింది.

"లేదు చెరీ మనకి తెలిసిన మధ్య తరగతి మందహాసాల గురించి ఓ కథ రాసి నేనే నీ పేరున పంపాను" చిరునవ్వుతో చెప్పాడు అమిత్.

"అవునా? మీరు కష్టపడి రాసి నా పేరున ఎందుకు పంపారు?" ఆనందంగా అడిగింది చరిత.

"నేనంటే నువ్వేగా?" ఆమె నుదుటి మీద మృదువుగా ముద్దుపెట్టుకుంటూ చెప్పాడు అమిత్.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

**Click here to share your comments on this story**